సాక్షి
జనగామ

శుక్రవారం । 20 । సెప్టెంబర్ । 2024



కొత్త చట్టంతో ధరణి సమస్యలకు చెక్

ధరణి సమస్యలకు చెక్ పెట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం కొత్త ఆర్‌ఓఆర్ చట్టం రూపొందిస్తున్నదని ఎమ్మెల్సీ కోదండరాం అన్నారు. - 8లో▸



నిర్మాణాత్మక ఆలోచన ఉండాలి

నిర్మాణాత్మక ఆలోచనా విధానం కలిగి ఉండాలని కాకతీయ యూనివర్సిటీ రిజిస్ట్రార్ మల్లారెడ్డి అన్నారు. విద్యార్థులు మార్పులపై అవగాహన పెంచుకోవాలన్నారు. - 8లో▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
35^0 /23^0

జిల్లాలో ఉదయం పొడి వాతావరణం ఉంటుంది. మధ్యాహ్నం సమయంలో ఎండ కొంతమేరకు పెరుగుంది. సాయంత్రం ఆకాశం అక్కడక్కడా మేఘావృతం అవుతుంది.

న్యూస్‌రీల్

సోమనాథుడి పేరు సముచితం..



పాలకుర్తి టౌన్: తెలుగు విశ్వవిద్యాలయానికి పాల్కురికి సోమనాథుడి పేరు మాత్రమే సముచితమని తెలంగాణ హైకోర్టు సీనియర్ నాయవాది కొప్పోలు రాజేంద్రప్రకాశ్ అన్నారు. గురువారం స్మృతి వనాన్ని సందర్శించి మాట్లాడుతూ సోమనాథుడికి సాటి రాగల కవి తెలుగు సాహిత్యంలో లేడు.. రాడు అని పేర్కొన్నారు. అనంతరం రాజేంద్రప్రకాశ్, కరుణ దంపతులు పాలకుర్తి శ్రీసోమేశ్వర స్వామికి పూజలు నిర్వహించి వల్మిడి, బమ్మెరలోని మహాకవుల చారిత్రక విశేషాలు తిలకించారు. వారివెంట ఎస్‌టీయూ రాష్ట్ర పూర్వ అధ్యక్షుడు బచ్చు భుజంగరావు, సోమనాథ కళాపీఠం అధ్యక్షుడు డాక్టర్ రాపోలు సత్యనారాయణ, దేవగిరి రామన్న, మెరుగు మధు, లెనిన్ తదితరులు ఉన్నారు.

ప్రతిభ చాటిన క్రీడాకారుల వివరాలు ఇవ్వాలి

జనగామ రూరల్: జిల్లాలో ప్రతిభ చాటిన క్రీడాకారుల వివరాలు అందించాలని జిల్లా క్రీడా యుజన అధికారి వెంకట్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. 2019 జనవరి నుంచి ఇప్పటి వరకు రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ క్రీడల పోటీల్లో ప్రతిభ కనబర్చిన వారు పోటీల వివరాలు, పొందిన సర్టిఫికెట్ల జిరాక్స్‌లు, రెండు ఫొటోలు ఈనెల 24వ తేదీలోగా జిల్లా యుజవన, క్రీడాధికారి కార్యాలయంలో అందజేయాలన్నారు. వ్యక్తిగతంగా ఇచ్చే సమాచారం మాత్రమే స్వీకరించబడుతుందని, క్రీడాకారుడి పేరు, అడ్రస్, ఫోన్ నంబర్, వార్షిక ఆదాయం, విద్యార్హతలు, కోచ్ పేరు పొందుపర్చాలని పేర్కొన్నారు. సంబంధిత కోచ్ లేదా అసోసియేషన్ కార్యదర్శి, పీఈటీ, పీడీ ధ్రువీకరించాలని వివరించారు.

హనుమాజీకి డాక్టరేట్



దేవరుప్పుల : సీతారాంపురం గ్రామానికి చెందిన కాంటారి హనుమాజీకి చెన్నైలోని భరత్ విశ్వవిద్యాలయం డాక్టరేట్ అందజేసింది. 'ఐసోలేటెడ్ విండ్ హైడ్రో హైబ్రిడ్ సిస్టం యూజింగ్ జనరేటర్ బ్యాటరీ స్టోరేజ్' అనే అంశంపై డాక్టర్ ఎస్‌పీ.విజయ రాఘవన్ పర్యవేక్షణలో పరిశోధన పూర్తి చేసి సమర్పించిన గ్రంథానికి విశ్వవిద్యాలయం అధికారులు డాక్టరేట్ ప్రదానం చేశారు. ప్రస్తుతం హనుమాన్‌జీ మల్లారెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా ఎనిమిదేళ్ల నుంచి విధులు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా హనుమాజీకి.. ఉప్పల సురేష్ బాబు, ఆర్.రమేష్ అభినందలు తెలిపారు.

బీసీ ఓవర్సీస్ పథకానికి దరఖాస్తుల ఆహ్వానం

జనగామ రూరల్: మహాత్మా జ్యోతిబాపూలే విదేశీ విద్యానిధి పథకానికి జిల్లాలోని బీసీ, ఈబీసీ విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని బీసీ సంక్షేమాధికారి బి.రవీందర్ ఒక ప్రకటనలో తెలిపారు. వయసు 35 ఏళ్ల లోపు, వార్షిక ఆదాయం రూ.5లక్షలకు మించొద్దన్నారు. తప్పనిసరిగా పాస్‌పోర్ట్ ఉండాలని, సంబంధిత ప్రవేశ పరీక్షల్లో అర్హత సాధించిన వారు వచ్చే నెల 15లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు.

రోబోటిక్స్‌తో సృజనాత్మకత పెంపు : డీఈఓ



రఘునాథపల్లి: రోబోటిక్స్‌తో విద్యార్థుల్లో సృజనాత్మకత పెంపొందుతుందని జిల్లా విద్యాధికారి రాము అన్నారు. స్థానిక ఉన్నత పాఠశాలలో సోహం అకాడమీ ఆఫ్ హ్యూమన్ ఎక్సలెన్స్ ఆధ్వర్యంలో 7,8,9 తరగతుల విద్యార్థులకు నిర్వహిస్తున్న 'రోబోటిక్స్ ఇన్ అకాడమిక్స్' శిక్షణను గురువారం డీఈఓ, డీఎస్‌ఓ రఘునందన్ పరిశీలించారు. విద్యార్థులు నేర్చుకున్న రోబోటిక్స్ సూత్రాలపై ఆరాతీసిన అనంతరం విద్యార్థులకు కిట్లు, సర్టిఫికెట్లు పంపిణీ చేశారు.

డీహెచ్, మెడికల్ కళాశాల పోస్టుల నోటిఫికేషన్ రద్దు

జనగామ: జిల్లా ప్రభుత్వ జనరల్ ఆస్పత్రితో పాటు మెడికల్ కళాశాలలో ఔట్ సోర్సింగ్ పద్ధతిలో ల్యాబ్ అటెండర్‌తో పాటు 50 పోస్టుల భర్తీకి రెండోసారి వేసిన నోటిఫికేషన్ తాత్కాలికంగా రద్దు చేసినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ గోపాల్‌రావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తదుపరి నోటిఫికేషన్‌ను వీలైనంత త్వరగా ప్రకటించనున్నట్లు పేర్కొన్నారు.

'యువజన' సంబురం

27న జూబ్లీ గార్డెన్‌లో వేడుకలు
- జిల్లా స్థాయి యువజన కళాకారుల ఎంపికలు
- యువతీ యువకులకు 10 కేటగిరీల్లో ప్రదర్శన పోటీలు



జనగామ: మారుమూల పల్లెల్లో యువతలో దాగిఉన్న ప్రతిభను గుర్తించేందుకు తెలంగాణ ప్రభుత్వం యువజన సంబురాలకు శ్రీకారం చుట్టింది. చదువుతో పాటు కళలు, కళా ప్రదర్శనలు, ఆటల్లో యువతను ప్రోత్సహిస్తోంది. అందులో భాగంగా పది కేటగిరీల్లో ప్రదర్శనలకు అవకాశం ఇస్తూ.. జిల్లా స్థాయి యువజన కళాకారుల ఎంపిక -2025 పేరిట పోటీలు నిర్వహించనున్నారు. జిల్లా స్థాయి యువజన కళాకారుల ఎంపిక కోసం ఈనెల 27న జిల్లా కేంద్రంలోని జూబ్లీగార్డెన్‌లో యువజన, క్రీడల శాఖ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. జానపద నృత్యం(గ్రూప్/వ్యక్తిగతం), జానపద పాటలు (గ్రూప్/వ్యక్తిగతం), కవిత్వం(హిందీ/ఇంగ్లిష్), వ్యాసరచన(హిందీ/ఇంగ్లిష్), చిత్ర లేఖనం, ఉపన్యాసం(హిందీ/ఇంగ్లిష్), యువక్రితి(హస్తకళలు, వస్త్రాలు, వ్యవసాయ ఉత్పత్తి), సైన్స్ మేళా నిర్వహిస్తున్నారు. 15 నుంచి 29 సంవత్సరాల లోపు వయసు వారు మాత్రమే అర్హులు. ఇందుకు సంబంధించి కలెక్టర్ రిజ్వాన్ బాషా ఆదేశాల మేరకు సంబంధిత శాఖ అధికారులు జిల్లాలో విస్తృత ప్రచారం చేస్తున్నారు. ఆసక్తి కలిగిన యువతీ యువకులు ఈ నెల 25వ తేదీలోగా కలెక్టరేట్ రెండో అంతస్తులోని ఎస్–15 జిల్లా యువజన, క్రీడల కార్యాలయంలో వ్యక్తిగతంగా లేదా dysojn.@gmail.com మెయిల్ ద్వారా, వాట్సప్ 9652197323 నంబర్‌లో వివరాలతో కూడిన పేర్లను నమోదు చేసుకోవచ్చు.

జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయి వరకు..

మొత్తం పది కేటగిరీలు ఉండగా.. ప్రథమ స్థానంలో నిలిచిన వారిని రాష్ట్ర స్థాయికి ఎంపిక చేస్తారు. రాష్ట్ర స్థాయిలో మొదటి స్థానంలో నిలిచిన విజేతలను వచ్చే ఏడాది జనవరి 12 నుంచి 16 వరకు జాతీయ స్థాయిలో జరిగే వేడుకలకు పంపిస్తారు.

యువత సద్వినియోగం చేసుకోవాలి



జిల్లా స్థాయి యువజన కళాకారుల ఎంపిక వేదికను యువత సద్వినియోగం చేసుకోవాలి. జిల్లా స్థాయిలో అర్హత సాధించిన ప్రథములను రాష్ట్ర స్థాయికి, అక్కడ విజేతలుగా నిలిచిన వారిని జాతీయ స్థాయికి పంపిస్తారు. చదువుతో పాటు ఆటలు, కళారూపకంగా రాణిస్తున్న వారికి ఇది చక్కటి వేదిక.

– బి.వెంకట్‌రెడ్డి,
జిల్లా యువజన క్రీడల అధికారి

జానపద నృత్య బృందం
ఈ బృందంలో సభ్యుల సంఖ్య 10కి మించరాదు. ప్రదర్శనకు గరిష్ట కాలప రిమితి 15 నిమిషాలు.

జానపద పాటల బృందం
సభ్యుల సంఖ్య 10 మందికి మించరాదు. ప్రదర్శనకు గరిష్ట కాలపరిమితి 7 నిమిషాలు.

జానపద నృత్యం(వ్యక్తిగతం)
ఈ బృందంలో ఐదుగురికి మించరాదు. ప్రదర్శనకు గరిష్ట కాలపరిమితి 7 నిమిషాలు.

జానపద పాటలు(వ్యక్తిగతం)
ఇందులో 5గురు సభ్యులకు మించరాదు. ప్రదర్శనకు గరిష్ట కాలపరిమితి 7 నిమిషాలు.
నోట్ : భారత సంప్రదాయానికి అనుగుణంగా ఉండాలి. సినిమా పాటలు అనుమతించబడవు. వాయిద్య పరికరాలు అభ్యర్థులే తెచ్చుకోవాల్సి ఉంటుంది. గతంలో లైవ్ ప్రదర్శన చేసిన వారికి ప్రాధాన్యత.

కవిత్వం (హిందీ/ఇంగ్లిష్)
ఒక్కొక్కరు ఒక రచనను మాత్రమే సమర్పించాలి. మొత్తం 500 పదాలతో గంటలో(60 నిమిషాలు) పూర్తి చేయాలి.

వ్యాస రచన(హిందీ/ఇంగ్లిష్)
ఒక్కొక్కరు ఒక రచనను మాత్రమే సమర్పించాలి. ఇందులో 1,000 పదాలతో 60 నిమిషాల్లో పూర్తి చేయాలి.
నోట్ : ఏ కులం, మతం, జాతి, వర్గాన్ని కించపరిచే విధంగా ఉండకూడదు. రచనలో అభ్యంతరకరంగా, అస్పష్టం లేదా అనుచిత వాఖ్యలు ఉండకూడదు.

పెయింటింగ్
- ఒక్కొక్కరు ఒక పెయింటింగ్ మాత్రమే సమర్పించాలి. ఎంట్రీ ఒరిజినల్ అయి ఉండాలి. పెయింటింగ్ ఏ3 సైజులో 90 నిమిషాల వ్యవధిలో పూర్తి చేయాలి.
- పెయింటింగ్ ఏదైనా నిర్దిష్ట సంస్థకు లేదా బ్రాండ్ పేరు ప్రాతినిధ్యం ఉండకూడదు. చిత్రలేఖనానికి సంబంధించిన శీర్షిక 20–30 పదాలు మించకూడదు. పెయింటింగ్ సామగ్రిని ఎవరికి వారే తెచ్చుకోవాలి.

ఉపన్యాసం(హిందీ/ఇంగ్లిష్)
ఎంపిక చేసిన అంశంపై హిందీ లేదా ఇంగ్లిష్‌లో 3 నిమిషాలు మించకుండా మాట్లాడాలి.

యువక్రితి(హస్తకళలు, వస్త్రాలు, వ్యవసాయ ఉత్పత్తి)
హస్తకళలు, వస్త్రాలు, వ్యవసాయ ఉత్పత్తి కేటగిరీల్లో తయారు చేసిన ఉత్పత్తులను ప్రదర్శనకు తీసుకురావాలి. ఇందులో ఎంపిక చేసిన వారు రాష్ట్ర స్థాయికి అర్హత సాధిస్తారు.
సైన్స్ మేళా : యువత సైన్స్ అండ్ టెక్నాలజీలో తయారు చేసిన కొత్త ప్రాజెక్టులను ప్రదర్శనకు తీసుకురావాలి. వ్యక్తిగతం లేదా గ్రూప్‌గా పాల్గొనే అవకాశం ఉంది. ఇందులో ఎంపికైన ప్రాజెక్టును రాష్ట్రస్థాయికి పంపిస్తారు.

విద్యార్థులు ప్రతిభ కనబరచాలి

- కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా



గూగుల్ మీట్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ రిజ్వాన్

జనగామ రూరల్: జాతీయ అచీవ్ మెంట్ సర్వే నాస్‌లో విద్యార్థులంతా ప్రతిభ కనబరచాలి.. ఆ మేరకు ప్రత్యేక యాక్షన్ ప్లాన్ రూపొందించి అమలు చేయాలని కలెక్టర్ రిజ్వాన్ బాషా సూచించారు. విద్యాశాఖ ఆధ్వర్యాన నేషనల్ అచీవ్‌మెంట్ సర్వే -2024 అవగాహన కార్యక్రమంపై సంబంధిత ప్రభుత్వ, ప్రైవేట్ విద్యా సంస్థల హెచ్‌ఎంలు, నోడల్ అధికారులకు అదనపు కలెక్టర్ పింకేష్‌కుమార్‌తో కలిసి గురువారం గూగుల్ మీట్ నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. ఆంగ్ల భాషపై పట్టు సాధించేందుకు 3,6,9 తరగతుల విద్యార్థులపై దృష్టి పెట్టి ప్రశ్నపత్రాలు రూపొందించాలన్నారు. మాక్ టెస్టుల జవాబు పత్రాలు అందజేస్తామని, వాటిని అనుసరించి విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో వివరించాలని చెప్పారు. విద్యార్థుల హాజరు పెంచడానికి వారి తల్లిదండ్రులతో మాట్లాడాలని సూచించారు. సర్వేలో జిల్లాను ఉన్నత స్థానంలో నిలబెట్టడానికి హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లాలోని అన్ని పాఠశాలల్లో యువ టూరిజం క్లబ్(వైటీసీ)లను స్థాపించి వాటిని టూరిజం వెబ్‌సైట్‌లో రిజిస్టర్ చేసుకోవాలని సూచించారు. ఈనెల 21న జరిగే పేరెంట్, టీచర్స్ మీటింగ్‌లో పర్యావరణ పరిరక్షణ, సరైన పారిశుద్ధ్య నిర్వహణ, స్వచ్ఛత కార్యక్రమాలపై అవగాహన కల్పించాలని చెప్పారు. అమ్మ ఆదర్శ పాఠశాలలకు సంబంధించి పనులు పూర్తయిన వాటికి నిధులు మంజూరుపై హెచ్‌ఎంలు సంబంధిత ఇంజనీర్లకు సమాచారం అందించాలని పేర్కొన్నారు. 'ఇంటింటా చదువుల పంట' యాప్‌పై విద్యార్థులకు, తల్లిదండ్రులకు అవగాహన కల్పించి మంచి ఫలితాల కోసం కృషి చేయాలన్నారు. విద్యాశాఖ అధికారి రాము, గుణాత్మక విద్య సమన్వయ అధికారి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కస్తూర్బాలో సౌకర్యాల కల్పనకు కృషి

చిల్పూరు: కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో సౌకర్యాల కల్పనకు కృషి చేయనున్నట్లు కలెక్టర్ రిజ్వాన్ బాషా అన్నారు. రాజవరం జీపీ పరిధిలోని కస్తూర్బా విద్యాలయాన్ని గురువారం స్టేషన్‌ఘన్‌పూర్ ఆర్డీఓ వెంకన్నతో కలిసి సందర్శించారు. పాఠశాల ఎస్‌ఓ ప్రశాంతి పలు సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకురాగా.. పరిశీలించారు. కొన్ని పనులు అసంపూర్తిగా ఉండగా అక్కడే ఉన్న కాంట్రాక్టర్లతో మాట్లాడి త్వరితగతిన చేపట్టాలని ఆదేశించారు. విద్యార్థులకు పలు ప్రశ్నలు వేసి సమాధానాలు రాబట్టారు. అనంతరం మండల కేంద్రంలో సమీకృత ప్రభుత్వ భవనాల నిర్మాణ స్థలంతోపాటు తహసీల్, ఎంపీడీఓ కార్యాలయాల్లో రికార్డులు పరిశీలించారు. ఎంపీడీఓ కార్యాలయం ఇరుకుగ్గా ఉన్నందున స్థల పరిశీలన పూర్తయితే నిర్మాణానికి అనుమతులు వస్తాయన్నారు. ఎంపీడీఓ బర్మావత్ శంకర్ నాయక్, ఆర్‌ఐ శ్రీనివాస్, ఎంపీఓ మధుసూదన్, తహసీల్దార్ సరస్వతి, మండల నోడల్ అధికారి గోవర్ధన్, ఉపాధి హామీ ఏపీఓ మోహన్‌రావు, సింగపురం కిరణ్‌కుమార్, మాజీ సర్పంచ్ రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల ఆవరణ శుభ్రంగా ఉండాలి

అదనపు కలెక్టర్ పింకేష్‌కుమార్



పరిసరాలను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్

బచ్చన్నపేట : ప్రభుత్వ పాఠశాలల ఆవరణ పరిశుభ్రంగా ఉండాలని అదనపు కలెక్టర్ పింకేష్‌కుమార్ అన్నారు. గురువారం స్థానిక ఆదర్శ పాఠశాలను సందర్శించిన ఆయన.. ఇక్కడ జరుగుతున్న మరుగుదొడ్ల తదితర పనులను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ అక్టోబర్ 2 వరకు స్వచ్ఛత పక్షోత్సవాలు నిర్వహిస్తూ గ్రామాల్లో పారిశుద్ధ్యంపై అవగాహన కల్పించనున్నట్లు పేర్కొన్నారు. రోజూ పాఠశాలలో విద్యార్థులకు పలు పోటీలు నిర్వహిస్తూ గెలుపొందిన వారికి ప్రోత్సాహక బహుమతులు అందజేయాలని చెప్పారు. ఇంటర్, టెన్త్ విద్యార్థులకు కెరీర్, గైడెన్స్‌పై మార్గ నిర్దేశం చేయాలన్నారు. డీఈఓ రాము, మండల నోడల్ అధికారి వెంకట్‌రెడ్డి, తహసీల్దార్ మహిపాల్‌రెడ్డి, ఎంపీడీఓ మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

'హైడ్రా'.. సీఎం సొంత ఎజెండా

- శాసనసభలో చర్చ ఎందుకు తీసుకు రాలేదు..
- ఎంపీ ఈటల రాజేందర్



రైల్వేస్టేషన్ ఆవరణలో ఆన్‌లైన్ సభ్యత్వ నమోదు ప్రారంభిస్తున్న ఈటల రాజేందర్

జనగామ: తెలంగాణలో చట్టబద్ధత లేకుండా అమలుచేస్తున్న 'హైడ్రా' స్కీం సీఎం రేవంత్‌రెడ్డి సొంత ఎజెండాగా మారిందని బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు, మల్కాజిగిరీ ఎంపీ ఈటల రాజేందర్ విమర్శించారు. పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ, మహాత్మాగాంధీ, లాల్‌బహదూర్ శాస్త్రి జన్మదినాన్ని పురస్కరించుకుని బీజేపీ ఇచ్చిన పిలుపు మేరకు సేవాపక్షం కార్యక్రమంలో భాగంగా గురువారం స్థానిక రైల్వేస్టేషన్ ఆవరణలో పార్టీ ఆన్‌లైన్ సభ్యత్వ నమోదు, జూబ్లీగార్డెన్‌లో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ప్రారంభించిన అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. 'హైడ్రా' రాష్ట్రానికి శ్రీరామరక్ష అని భావిస్తే.. కేబినెట్, శాసనసభ సమావేశాల్లో ఎందుకు చర్చించలేదని ప్రశ్నించారు. అక్రమ నిర్మాణాలు, కట్టడాలను బీజేపీ ఎప్పుడూ కోరుకోలేదని, చెరువులు, వాగుల రక్షణకు తాము కట్టుబడి ఉన్నామని స్పష్టం చేశారు. అన్ని అనుమతులతో ఏళ్ల తరబడి కరెంటు, నీటి బిల్లులు చెల్లిస్తున్న నిర్మాణాలను చట్టబద్ధత లేని 'హైడ్రా' పేరిట బుల్డోజర్లతో కూల్చివేయడం రాజ్యాంగాన్ని ఉల్లంఘించడమే అన్నారు. నాడు పాలక ప్రభుత్వాలు పేదలకు 60 నుంచి 80 గజాల స్థలాలు కేటాయించి ఇంటి నిర్మాణాలు చేస్తే.. నోటీసులు ఇవ్వకుండా నిరుపేదల ఇళ్లను కూల్చివేయడం అత్యంత హేయమైన చర్య అన్నారు. తెలంగాణ.. సీఎం రేవంత్‌రెడ్డి అడ్డా, జాగీర్ కాదని హెచ్చరించారు. చెరువులు ఆక్రమణకు గురయ్యాయని గుర్తిస్తే ప్రైవేటు పట్టా పరిధిలోని ఎఫ్‌టీఎల్ భూములను ప్రభుత్వం కొనుగోలు చేసి హద్దులు ఏర్పాటు చేయాలన్నారు. దీనిపై కేబినెట్‌లో చర్చించి, అనుభవజ్ఞులతో కమిటీ వేసి చెరువుల సంరక్షణకు చర్యలు చేపట్టాలని, ఇవేమీ చేయకుండా కళ్లు మూసుకుని పిచ్చిపని చేస్తే నాడు కేసీఆర్‌కు పట్టిన గతే రేవంత్ రెడ్డి సర్కారుకు పడుతుందన్నారు. సమావేశంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆరుట్ల దశమంతరెడ్డి, కల్నల్ డాక్టర్ భిక్షపతి, సింగిల్‌విండో వైస్ చైర్మన్ సిద్దా రెడ్డి, కేవీఎల్ఎన్.రెడ్డి, విద్యాసాగర్ రెడ్డి, కొంతం శ్రీనివాస్, మహంకాళి హరిశ్చంద్రగుప్త, ఉడుగుల రమేష్, సౌడ రమేష్, పట్టణ అధ్యక్షుడు బొమ్మగాని అనిల్‌గౌడ్, చిమ్ముల నరేందర్‌రెడ్డి, శానబోయిన మహిపాల్, రాంకోటి, పెద్దోజు జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

సొసైటీ డబ్బులు సొంతానికి..

- కంచనపల్లి పీఏసీఎస్‌లో అక్రమాలు
- అధ్యక్షుడు రవీందర్‌జీపై అనర్హత వేటు
- రూ.17.25 లక్షలు దుర్వినియోగం అయినట్టు గుర్తింపు
- రికవరీ చేయాలని అధికారుల ఆదేశాలు
- వారంలో నూతన అధ్యక్షుడి ఎన్నిక



కంచనపల్లి సొసైటీ కార్యాలయం

రఘునాథపల్లి: మండల పరిధి కంచనపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార సొసైటీ(పీఏసీఎస్)లో అవకతవకలకు పాల్పడిన వారిపై అధికారులు చర్యలకు ఉపక్రమించారు. సొసైటీకి చెందిన రూ.17.25 లక్షలు దుర్వినియోగమైనట్లు గుర్తించిన జిల్లా కోఆపరేటివ్ అధికారులు సొసైటీ అధ్యక్షుడిని అనర్హుడిగా ప్రకటిస్తూ ఈనెల 17వ తేదీన ఉత్తర్వులు జారీ చేశారు. సొసైటీ కార్యదర్శి అనేక అక్రమాలకు పాల్పడటంతో పాలకవర్గం తీర్మానం మేరకు సీఈఓ వంగ శ్రీనివాస్‌ను గతంలోనే సస్పెండ్ చేశారు. పీఏసీఎస్ ఎన్నికలు 2020 ఫిబ్రవరి 15న జరగ్గా.. అదే నెల 17న రఘునాథపల్లికి చెందిన సీహెచ్.రవీందర్‌జీ అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. సొసైటీలో అక్రమాలు జరిగాయన్న ఫిర్యాదుల నేపథ్యంలో జిల్లా కోఆపరేటివ్ కార్యాలయ అధికారి ఏఆర్‌వీ.వేణుగోపాల్ సమగ్ర విచారణ చేపట్టి ఉన్నతాధికారులకు నివేదిక సమర్పించారు. సొసైటీలో పాలనాపరమైన లోపాలు జరిగాయని, అధ్యక్షుడు అధికారాలను దుర్వినియోగం చేసినట్లు నివేదికలో పేర్కొన్నారు. దీని ఆధారంగా డీసీఓ రాజేందర్‌రెడ్డి చర్యలకు ఆదేశాలు జారీ చేశారు. తెలంగాణ కోఆపరేటివ్ సొసైటీ యాక్ట్–1964, సెక్షన్ 21–(ఏ) ప్రకారం చైర్మన్ రవీందర్‌జీపై అనర్హత వేటు వేస్తున్నట్లు ఉత్తర్వులో స్పష్టం చేశారు. మొత్తం రూ.17.25 లక్షలను అధ్యక్ష, కార్యదర్శుల నుంచి రికవరీ చేయాలి ఆదేశాలిచ్చారు.

వివరణ సంతృప్తిగా లేదంటూ..

ఆర్థిక అవకతవకలు, అధికార దుర్వినియోగం నేపథ్యంలో లిఖిత పూర్వక వివరణ ఇవ్వాలని రవీందర్‌జీకి గతంలో డీసీఓ కార్యాలయం నోటీసులిచ్చింది. విచారణలో భాగంగా అధికారులు సేకరించిన ఆధారాలు.. రవీందర్‌జీ ఇచ్చిన వివరణ సహేతుకంగా, సంతృప్తికరంగా లేకపోడంతో అధికారులు దానిని పరిగణలోకి తీసుకోవద్దని నిర్ణయించారు. ఈ క్రమంలో సొసైటీ కోఆపరేటివ్ యాక్ట్ ప్రకారం రవీందర్‌జీ అధ్యక్ష పదవికి అనర్హుడిగా ప్రకటించారు. వారంలో నూతన అధ్యక్షుడిని ఎన్నుకోనున్నట్లు పేర్కొన్నారు.

హెల్త్ హబ్‌గా వరంగల్

- రూ.30 కోట్లతో కేన్సర్ ట్రామా సెంటర్
- కిడ్నీ ట్రాన్స్ ప్లాంటేషన్, ఐవీఎఫ్ కేంద్రాలు కూడా..
- రాష్ట్ర వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనరసింహ
- నర్సంపేటలో జిల్లా ఆసుపత్రి వైద్య కళాశాల ప్రారంభం
- పాల్గొన్న మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, కొండా సురేఖ



మాట్లాడుతున్న రాష్ట్ర వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనరసింహ, చిత్రంలో మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, కొండా సురేఖ, ఎంపీ బలరాంనాయక్, ఎమ్మెల్యేలు తదితరులు

సాక్షి, వరంగల్: వరంగల్‌ను హెల్త్ హబ్‌గా నిర్మించే దిశగా రాష్ట్ర ప్రభుత్వం అడుగులు వేస్తున్నట్లు రాష్ట్ర వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. వరంగల్ జిల్లా నర్సంపేటలో రూ.183 కోట్ల వ్యయంతో నిర్మించిన జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి, వైద్య కళాశాలను రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ, నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డితో కలిసి గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా నర్సంపేట జిల్లా ఆస్పత్రి పేరును పాకాల జిల్లా ఆస్పత్రిగా మార్చాలని ఎమ్మెల్యే దొంతి.. మంత్రులకు విజ్ఞప్తి చేశారు. అనంతరం మంత్రి రాజనర్సింహ మాట్లాడుతూ ఉమ్మడి వరంగల్‌లో అత్యాధునిక అంబులెన్సులు, ట్రామా, కిడ్నీ ట్రాన్స్‌ప్లాంటేషన్, ఐవీఎఫ్, పిడియాట్రిక్ సెంటర్లు తదితర వైద్యసేవలన్నీ రానున్న రోజుల్లో తీసుకువస్తామన్నారు. త్వరలో రూ.30 కోట్లతో కేన్సర్ ట్రామా సెంటర్ ఏర్పాటు చేస్తామని చెప్పారు.



నర్సంపేటలో వైద్యకళాశాల భవనాన్ని ప్రారంభిస్తున్న మంత్రులు దామోదర రాజనర్సింహ, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, కొండా సురేఖ, చిత్రంలో ఎంపీ బలరాంనాయక్, ఎమ్మెల్యే మాధవరెడ్డి

నర్సంపేటలో ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ : మంత్రి పొంగులేటి

మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ అన్ని నియోజకవర్గాల్లో ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ నిర్మించనున్నామన్నారు. నర్సంపేటకు మొదటి ప్రాధాన్యతలోనే అవకాశం ఉంటుందని చెప్పారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ హెల్త్ కార్డులు, రేషన్ కార్డులు వేరు వేరుగా అందించనున్నట్లు వెల్లడించారు. సాంకేతిక కారణాలతో కొంతమంది రైతులకు రుణమాఫీ ప్రయోజనం అందలేదని, వీలైనంత త్వరలో వాటిని పరిష్కరిస్తామని తెలిపారు.

ఎంజీఎంను గాడినపెట్టే ప్రయత్నం చేస్తున్నాం : కొండా సురేఖ

మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ వరంగల్ ఎంజీఎం ఆస్పత్రిని గాడినపెట్టే ప్రయత్నాలు చేస్తున్నామన్నారు. వైఎస్ రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు 104, 108 సర్వీసులు తెచ్చి ఎంతో మంది నిరుపేద కుటుంబాలలో వెలుగులు నింపారన్నారు. ఇప్పుడు అదే స్ఫూర్తితో సీఎం రేవంత్ రెడ్డి వైద్య, విద్య,అభివృద్ధి, సంక్షేమంపై దృష్టి సారించారన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వ విప్ రాంచంద్రునాయక్, ఎంపీ బలరాంనాయక్, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, ఎమ్మెల్యేలు డాక్టర్ మురళి నాయక్, నాయిని రాజేందర్‌రెడ్డి, కేఆర్.నాగరాజు, 'కుడా' చైర్మన్ ఇనగాల వెంకట్రాంరెడ్డి, కలెక్టర్ డాక్టర్ సత్యశారద, డీఎంహెచ్‌ఓ వాణి పాల్గొన్నారు.

ఓటరు జాబితా సవరణకు అవకాశం : డీపీఓ



సమావేశంలో మాట్లాడుతున్న డీపీఓ

స్టేషన్‌ఘన్‌పూర్: ఓటరు జాబితా సవరణకు అవకాశం ఉందని డీపీఓ స్వరూప అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం రాజకీయ పార్టీల ముఖ్య నాయకులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల తర్వాత ప్రభుత్వ ఆదేశాల మేరకు ఓటరు జాబితా నమోదు పూర్తి అయిందన్నారు. గత ఎన్నికల ఓటరు జాబితా మాత్రమే మ్యాపింగ్ పద్ధతిన పూర్తయింది.. కుటుంబ సభ్యుల ఓట్లు పొందుపరిచి ఉన్నాయా లేదా అనేది స్థానిక నాయకులకు అవగాహన ఉంటుంది.. తగిన సమాచారం ఇస్తే మార్పులు చేసే వీలుంటుందన్నారు. జాబితాలో ఎలాంటి మార్పులు చేసే అవకాశం తమకు లేదని, కేవలం వార్డుల వారీగా మారుస్తామని స్పష్టం చేశారు.

పార్టీ వ్యతిరేకులను సస్పెండ్ చేయాలి



డీసీసీ కార్యాలయంలో మాట్లాడుతున్న నాయకులు

జనగామ: జనగామ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీకి వ్యతిరేకంగా వ్యవహరిస్తున్న వారిని వెంటనే సస్పెండ్ చేయాలని జిల్లా యువజన అధ్యక్షుడు బనుక శివరాజ్ యాదవ్, రాష్ట్ర ఎస్సీ సెల్ జాయింట్ కన్వీనర్ మిద్దెపాక సిద్దులు డిమాండ్ చేశారు. గురువారం పార్టీ జిల్లా కార్యాలయంలో పట్టణ, మండల కాంగ్రెస్ అధ్యక్షులు చెంచారపు బుచ్చిరెడ్డి, లింగాల నర్సిరెడ్డి ఆధ్వర్యాన ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. ఈ నెల 17న కలెక్టర్ కార్యాలయ ప్రాంగణంలో జరిగిన ప్రజాపాలన దినోత్సవ సభలో ప్రభుత్వం అమలు చేస్తున్న కార్యక్రమాలపై విప్ ప్రసంగిస్తున్న సమయంలో 'కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి సభా వేదికపై ఏ ప్రొటోకాల్ ప్రకారం కూర్చున్నారంటూ' అసమ్మతి నేతలు వేముళ్ల సత్యనారాయణ, ఎర్రమల్ల సుధాకర్, మాసంపల్లి లింగాజీ పార్టీని అప్రతిష్ట పాలు చేసేందుకు ప్రయత్నం చేశారని ఆరోపించారు. సమావేశంలో బాలరాజ్ గౌడ్, మల్లేష్, ఉప్ప లయ్య, కట్టకృష్ణ, సిద్దులు, కృష్ణ, రాములు, దుర్గేష్ , శ్రీనివాస్, ఆనందం, శ్రీనివాస్, సుధాకర్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

దమ్ముంటే చర్చకు రావాలి : వేముళ్ల

నాలుగు దశాబ్దాలుగా కాంగ్రెస్ పార్టీ వైభవం కోసం పని చేస్తూ, పైసా ఆశించకుండా కార్యకర్తల వెన్నంటి నడిచే తనపై లేనిపోని ఆరోపణలు చేస్తున్న నాయకులు దమ్ముంటే చర్చకు రావాలని మున్సిపల్ మాజీ చైర్మన్ వేముళ్ల సత్యనారాయణరెడ్డి సవాల్ విసిరారు. ఆయన మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల్లో గెలిచే అవకాశం ఉన్నా చేతులారా జారవిడుచుకుని అంకిత భావంతో పని చేసిన వారిపై బురద జల్లడం సిగ్గుచేటన్నారు. పార్టీ పేరు చెప్పుకుని ఇష్టం వచ్చినట్టు వ్యవహరిస్తున్న వారు ఎవరో అధిష్టానం గమనిస్తున్నదని, ప్రతీ విషయం పెద్దల దృష్టికి వెళ్తోందన్నారు.

క్లుప్తంగా

కొత్త నిబంధనల మేరకు పీహెచ్‌డీ అడ్మిషన్లు

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలోని వివిధ విభాగాల్లో ఇక నుంచి కొత్త నిబంధనలను అనుసరించే పీహెచ్‌డీ అడ్మిషన్లు నిర్వహిస్తామని రిజిస్ట్రార్ పి. మల్లారెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు గురువారం ఉత్తర్వులు జారీచేశారు. ఇక నుంచి ప్రతి ఏడాది జనవరి, జూలై నెలల్లో పీహెచ్‌డీ అడ్మిషన్లకు వెకెన్సీలను బట్టి నోటిఫికేషన్లు ఇవ్వనున్నామని తెలిపారు. ఫెలోషిప్ కలిగిన అభ్యర్థులకే ఇకనుంచి పీహెచ్‌డీ అడ్మిషన్లు కల్పిస్తామన్నారు. యూజీసీ నెట్, సీఎస్ఐఆర్‌నెట్, సీడ్, డీబీటీ, ఎన్ఎఫ్‌పీడబ్ల్యూడీ ,డీఎస్‌టీ, ఇన్‌స్పైర్ ఆర్‌ఫిప్ లేదా జీప్, నెట్, గేట్, జీప్యాట్ ఇతర జాతీయ స్థాయి పరీక్షల స్కోర్ ఆధారంగానే నోటిఫికేషన్లు విడుదల చేయాలని ఉత్తర్వులు జారీచేశారు. మరిన్ని వివరాలకు డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.కాకతీయ.ఏసి.ఇన్‌లో చూడొచ్చని తెలిపారు. కేయూ ఇన్‌చార్జ్ వీసీ వాకాటి కరుణ ఆదేశాల మేరకు ఫ్యాకల్టీల వారీగా నోటిఫికేషన్లు విడుదల చేయాలని రిజిస్ట్రార్ ఉత్తర్వులు జారీచేశారు.

శ్రీధర్‌కుమార్‌పై చర్య తీసుకోవాలి

కేయూ క్యాంపస్: తనను ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలోని ఎకనామిక్స్ విభాగం కాంట్రాక్టు అధ్యాపకుడు డాక్టర్ శ్రీధర్‌కుమార్ లోథ్ వేధిస్తున్నారని హనుమకొండలోని యూనివర్సిటీ మహిళా పీజీ కళాశాలలో తెలుగు విభాగంలో పార్ట్‌టైం లెక్చరర్‌గా పనిచేస్తున్న అన్నపూర్ణ వాపోయారు. ఈ మేరకు గురువారం కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ మల్లారెడ్డికి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తాను యూనివర్సిటీ మహిళా పీజీ కళాశాలలో 14 సంవత్సరాలుగా తెలుగు విభాగంలో పార్ట్‌టైం లెక్చరర్‌గా పనిచేస్తున్నానన్నారు. అయితే క్యాంపస్‌లోని తెలుగు విభాగానికి బదిలీ దరఖాస్తు చేసుకున్నానని డిపార్ట్‌మెంటల్ కమిటీ (డీసీ) రాసి పంపగా.. ఆ ఆర్డర్ రాకుండా అడ్డుకుంటానని, ఆఫ్టాల్ పార్ట్‌టైం అంటూ శ్రీధర్ కుమార్‌లోథ్ తనను కించపరిచారని అన్నపూర్ణ ఆరోపించారు. అంతేగాకుండా తనను మానసికంగా వేధిస్తున్నాడని ఆరోపించారు. శ్రీధర్‌కుమార్‌లోథ్ తనకు ప్రాణభయం ఉందని, ఉద్యోగ అభద్రత కల్పిస్తున్న అతడిపై చర్యలు తీసుకోవాలని రిజిస్ట్రార్ మల్లారెడ్డికి అన్నపూర్ణ వినతిపత్రం సమర్పించారు.

ఏడీసీపీ సర్వే మళ్లీ షురూ..



బరాజ్‌లోని నీటిలో సర్వే చేస్తున్న అధికారులు

కాళేశ్వరం: జయశంకర్‌భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలం కాళేశ్వరం ప్రాజెక్టు పరిధి మేడిగడ్డ బరాజ్‌లో ప్రవాహపు అంచనా సర్వేను ఎన్‌డీఎస్ఏ సూచనల మేరకు ఏడీసీపీ (అకౌస్టిక్ డాప్లర్ కరెంట్ ప్రొఫైలర్) సర్వే మళ్లీ షురూ చేశారు. గురువారం పూణెకు చెందిన సీడబ్ల్యూపీఆర్ఎస్ శాస్త్రవేత్తలు నాగరాజు, అసిస్టెంట్ రీసెర్చ్ ఆఫీసర్ వినాయక్‌ధత్రక్‌లు బరాజ్ నీటిలో బోటుకు ఏడీసీపీ మిషన్ అమర్చి తిరుగుతూ ప్రవాహం అంచనా వేశారు. వారి వెంట డీఈఈ సురేశ్ తదితరులు ఉన్నారు.



విదేశీ కొలువుకు భరోసా..

ఇతర దేశాల్లో ఉపాధికి ద్వారం ‘టామ్‌కామ్’

- శిక్షణ అందించి ఉద్యోగావకాశాలు కల్పిస్తున్న ప్రభుత్వ సంస్థ
- దళారుల బారిన పడకుండా చర్యలు



టామ్‌కామ్ లోగో

న్యూశాయంపేట: తెలంగాణ రాష్ట్రంలోని నైపుణ్యం గల యువతకు గల్ఫ్‌తో పాటు ఇతర దేశాల్లో ఉద్యోగావకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. ఇందులో భాగంగా ఆయా దేశాల రాయబారులతో సంప్రదింపులు జరిపి నైపుణ్యం గల యువతకు శిక్షణ అందించి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా ‘టామ్‌కామ్’ ద్వారా చర్యలు చేపడుతోంది. విదేశీ ఉద్యోగాల పేరిట జరిగే మోసాలకు అడ్డుకట్ట వేసేందుకు, నిరుద్యోగులకు ఉద్యోగాల కల్పన కోసం ప్రభుత్వం 2016లో తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్‌పవర్ కంపెనీ లిమిటెడ్ (టామ్‌కామ్) ఏర్పాటు చేసింది. టామ్‌కామ్.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతో కలిసి పనిచేస్తూ నిరుద్యోగ యువత కలలను సాకారం చేస్తూ ఉద్యోగావకాశాలు కల్పిస్తోంది. ఇందులో భాగంగా ఇటీవల ఉద్యోగాల కల్పన కోసం విదేశీ రాయబార సంస్థలు గల్ఫ్, సౌదీ, ఖతార్, యూకే, యూఎస్ఏ, జపాన్, జర్మనీ దేశాలు లేఖలు రాస్తూ తమకు కావాల్సిన మానవ వనరుల కోసం తెలంగాణ ప్రభుత్వానికి(టామ్‌కామ్ సంస్థకు) పంపిస్తున్నాయి. నర్సింగ్, ఆతిథ్యం, ఆహార, భవన నిర్మాణం, ఎలక్ట్రిక్, వాహన, వ్యవసాయ రంగం, యంత్రాల తయారీ తదితర ఉద్యోగావకాశాలు విదేశాల్లో మెండుగా ఉన్నాయి.

విదేశాల్లో ఉద్యోగం చేయాలనే ఉత్సాహం..

నేటి యువతలో చదువు పూర్తయిన వెంటనే విదేశాల్లో ఉద్యోగాలు చేయాలనే ఉత్సాహం ఉంది. ఇదే అదనుగా భావిస్తున్న కొన్ని ప్రవేట్ సంస్థలు, సైబర్ నేరగాళ్లు.. విదేశీ ఉద్యోగాల పేరిట యువతను ఉచ్చులోకి లాగుతోంది. లక్షల్లో దండుకుంటూ ఉద్యోగావకాశాలు కల్పించకుండా మోసగిస్తున్నాయి. ఇలాంటి వార్తలు రోజూ ఎక్కడో ఒక చోట వినిపిస్తున్నాయి. అలాంటి వారికి అండగా నిలిచి నైపుణ్య శిక్షణ అందించి **విదేశాల్లో ఉండే పరిస్థితులపై అవగాహన కల్పిస్తోంది టామ్‌కామ్ సంస్థ. ఎలాంటి మోసాలకు తావులేకుండా పూర్తిస్థాయిలో శిక్షణలో స్టైఫండ్ అందించి ఆయా దేశాల రాయబారులతో సంప్రదించి ఉద్యోగ, ఉపాధి అవకాశాలను కల్పిస్తోంది. నైపుణ్యం గల యువత కోసం డిమాండ్ పెరుగుతున్న నేపథ్యంలో విదేశాలు భారత్ వైపు చూస్తున్నాయి. ఈ అవకాశాలను అం**దిపుచ్చుకోవడానికి తెలంగాణ రాష్ట్రంలోని అభ్యర్థులకు సురక్షితమైన, చట్టబద్ధమైన ఎంపిక ప్రక్రియను సులభతరం చేస్తోంది టామ్‌కామ్ సంస్థ.

టామ్‌కామ్ వెబ్‌సైట్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలి

టామ్‌కామ్ గల్ఫ్ దేశాలతో పాటు ఆస్ట్రేలియా, కెనడా జర్మనీ, హంగేరీ, పోలాండ్, రోమేనియా, యూకే, తదితర దేశాల్లో ఉద్యోగ అవకాశాలు కల్పిస్తోంది. జర్మనీలో లాజిస్టిక్, టెక్నికల్ హాస్పిటాలిటీ, ఫుడ్‌టెక్నాలజీ రంగాల్లో ఇంటర్వ్యూలు నిర్వహిస్తోంది. **రెండు నుంచి 3 సంవత్సరాల పాటు స్టైఫండ్‌తో కూడిన శిక్షణ అందించి శిక్షణ పూర్తి అయ్యాక ఉద్యోగం కల్పిస్తూ ఆకర్షణీయమైన** వేతనం పొందే అవకాశం అందిస్తోంది. ఈ ఉద్యోగాల కోసం అభ్యర్థి వయసు 28 సంవత్సరాల లోపు ఉండి ఇంటర్, డిప్లొమా, డిగ్రీ 60శాతం మార్కులు పై బడి ఉండాలి. ఫ్రెషర్స్ కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.

టామ్‌కామ్ వెబ్‌సైట్..

ఆసక్తి, అర్హత గల అభ్యర్థులు టామ్‌కామ్(TOMCOM) వెబ్‌సైట్‌లో లేదా మొబైల్ యాప్‌లో నమోదు చేసుకోవచ్చు. మరిన్ని వివరాల కోసం డబ్ల్యూ.డబ్ల్యూ.డబ్ల్యూ.టామ్‌కామ్.జీఓవీ.ఇన్ (www.tomcom.telangana.gov.in) 8125251408, 9100798204 నంబర్లను సంప్రదించాలి. మరిన్ని వివరాలకు హనుమకొండ సుబేదారి కలెక్టరేట్ కాంప్లెక్స్‌లోని జిల్లా ఉపాధి కల్పనాధికారిని సంప్రదించి వివరాలు తెలుసుకోవచ్చు.

నిర్మాణాత్మక ఆలోచన ఉండాలి

- కేయూ రిజిస్ట్రార్ మల్లారెడ్డి



జ్యోతిప్రజ్వలన చేస్తున్న రిజిస్ట్రార్ మల్లారెడ్డి, ఇతర అధ్యాపకులు

కేయూ క్యాంపస్: నిర్మాణాత్మక ఆలోచన విధానం కలిగి ఉండాలని కాకతీయ యూనివర్సిటీ రిజిస్ట్రార్ మల్లారెడ్డి అన్నారు. గురువారం యూనివర్సిటీలోని మహిళా కళాశాల వ్యవస్థాపక దినోత్సవాన్ని పురస్కరించుకుని క్యాంపస్‌లోని సెనెట్‌హాల్‌లో నిర్వహించిన ఇంజనీర్స్‌డే వేడుకలు, విస్తృతోపన్యాస కార్యక్రమాన్ని ప్రారంభిస్తూ రిజిస్ట్రార్ మల్లారెడ్డి మాట్లాడారు. కొన్ని సంవత్సరాల నుంచి వస్తున్న మార్పులను ఇప్పటి నుంచే అవగాహన చేసుకోవాలన్నారు. మన పరిశోధనల ఫలితాలు సామాన్యులకు అందాలన్నారు. గతంలో అప్రస్తుతం అనుకున్న టెక్నాలజీ ప్రస్తుతం ముఖ్యభూమిక పోషిస్తోందన్నారు. వరంగల్ నిట్ ఆచార్యుడు సురేశ్‌బాబు ‘సైబర్‌సెక్యూరిటీ ఇన్ ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్’ అనేఅంశంపై విస్తృతోపన్యాసం చేశారు. టెక్నాలజీ వస్తున్నా 5వ జనరేషన్ విప్లవంలో ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ విస్తృత పరిణామం చెందుతుందన్నారు. ఇందులో భాగంగా విద్యార్థులు వీటిపై పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. భద్రత, గోప్యత ముఖ్యఅంశాలుగా ఉండాలన్నారు. డ్రైవర్ రహిత కార్లు వస్తున్న నేపథ్యంలో ఇంజనీరింగ్ విద్యను ఫ్యాషన్‌తో పూర్తిచేయాలని సూచించారు. ఇంజనీరింగ్ విద్య కళ అన్నారు. అనంతరం ఆ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ కె. భిక్షాలు మాట్లాడుతూ ఈనెల 25న ఇంజనీంగ్ కళాశాల వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా విద్యార్థినులకు క్రీడాపోటీలు నిర్వహించబోతున్నామని వెల్లడించారు.

ఎస్సై బెదిరించాడని ఆందోళన



ఆందోళన చేస్తున్న భీమానాయక్, కుమారులు

మహబూబాబాద్ రూరల్: ఓ కేసు విషయంలో వివరాలు సేకరించేందుకు వచ్చిన ఎస్సై బెదిరించాడని ఆరోపిస్తూ ఓ వ్యక్తి, అతడి కుటుంబీకులు మహబూబాబాద్ అంబేడ్కర్ సెంటర్‌లో ఆందోళన నిర్వహించారు. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. మహబూబాబాద్‌లోని కురవి గేటు ప్రాంతంలో నివాసం ఉండే ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు గుగులోత్ భీమానాయక్ ఇంటికి గురువారం రాత్రి కురవి ఎస్సై గంద్రాతి సతీశ్, ఇద్దరు కానిస్టేబుళ్లు వచ్చి గాలించారు. ఓ కేసు విషయంలో వచ్చామని భీమానాయక్ కుమారుడు సూర్యప్రకాశ్‌కు తెలిపారు. అయితే కొంత సమయానికి భీమానాయక్ రాగానే పోలీసులకు, ఆ కుటుంబ సభ్యులు శివవర్మ, సూర్యప్రకాశ్ మధ్య వాగ్వాదం జరిగింది. అక్కడి నుంచి వారు అంబేడ్కర్ సెంటర్ వద్దకు చేరుకుని బైఠాయించి ఆందోళన చేపట్టారు. అకారణంగా తమను కురవి ఎస్సై సతీశ్ బెదిరించి ఎన్‌కౌంటర్ చేస్తామన్నారని ఆరోపించారు. విషయం తెలుసుకున్న టౌన్ సీఐ పెండ్యాల దేవేందర్ ఘటన స్థలానికి చేరుకుని వారితో మాట్లాడి ఆందోళన విరమింపజేశారు. ఆరోపణల నేపథ్యంలో కురవి ఎస్సై గంద్రాతి సతీశ్‌ను వివరణ కోరగా ఫోర్జరీ కేసులో మహబూబాబాద్ మండలం ఇస్లావత్ తండా(ఎం) మాజీ సర్పంచ్ ఇస్లావత్ నరేశ్‌ను రిమాండ్ చేయడానికి కురవి పోలీస్‌స్టేషన్‌కు పిలిచామన్నారు. నరేశ్ పారిపోయి భీమానాయక్‌తో కలిసి ద్విచక్ర వాహనంపై కనిపించాడని తమ సిబ్బంది చెప్పారని, దీంతో వారి ఇంటికి వెళ్లి వాకబు చేశామని, ఎలాంటి బెదిరింపులకు పాల్పడలేదని తెలిపారు.

బ్యాంకు లింకేజీ రుణం చెల్లించలేం

- ముంపు బాధిత డ్వాక్రా సంఘాల మహిళల స్పష్టీకరణ
- సీతారాంతండాలో నిరసన



నిరసన తెలుపుతున్న ముంపు బాధిత డ్వాక్రా మహిళలు

మరిపెడ రూరల్: ఇటీవల భారీ వర్షాల కారణంగా వచ్చిన ఆకేరు వాగు ఉధృతికి సర్వం కోల్పోయి ప్రాణాలతో బయటపడ్డామని, ఎస్‌బీఐ లింకేజీ రుణం (అప్పులు) ఎట్టి పరిస్థితుల్లో చెల్లించలేమని మండలంలోని సీతారాంతండా ముంపు బాధిత డ్వాక్రా సంఘాల మహిళలు తెలిపారు. ఈ మేరకు గురువారం తండాలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీతారాంతండాలో భవాని, శ్రీబాలాజీ, శ్రీవెంకటేశ్వర ఎస్‌హెచ్‌జీ డ్వాక్రా గ్రూపుల్లో సభ్యత్వం కలిగి ఉన్నామన్నారు. ఇటీవల గ్రూపునకు రూ.20 లక్షల చొప్పున ఎస్‌బీఐలో రుణం తీసుకున్నామన్నారు. నెలకు రూ. 5 వేల నుంచి రూ.6 వేల చొప్పున కిస్తీ చెల్లిస్తున్నామన్నారు. అయితే ఇటీవల వచ్చిన ఆకేరు వాగు ఉధృతికి ఇంట్లో ఉన్న తిండి గింజలు, దుస్తులు కొటుకుపోయాయని వాపోయారు. అదేవిధంగా మూగజీవాలు, పొలం కొట్టుకుపోయి ఆర్థికంగా చితికిపోయామని కన్నీటి పర్యంతమయ్యారు. ఈ క్రమంలో ఇంకా వరద భయం నుంచి బయటపడలేదని, కేవలం ప్రభుత్వ, దాతల సాయంతోనే నెట్టుకొస్తున్నామన్నారు. ప్రస్తుతం తామున్న ఉన్న పరిస్థితుల్లో రుణం చెల్లించలేమని చెప్పారు. ముంపు బాధితుల గోడు అర్థం చేసుకుని తమ రుణాలు మాఫీ చేయడంతో పాటు కొత్త రుణాలు ఇప్పించేలా ప్రభుత్వం ప్రత్యేక చొరవ చూపాలని వారు వేడుకున్నారు.

పాము కాటుతో తాపీమేస్త్రీ మృతి



సర్వర్‌పాషా (ఫైల్)

ఏటూరునాగారం /ములుగు రూరల్ : మండల కేంద్రానికి చెందిన తాపీమేస్త్రీ సర్వర్‌పాషా(30) పాము కాటుకు గురై మృతి చెందాడు. సర్వర్‌పాషా బతుకుదెరువు నిమిత్తం ములుగు మండలం ఇంచెర్ల వద్ద గుడిసెలు వేసుకుని తాపీమేస్త్రీ పని చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. ఈ క్రమంలో బుధవారం రాత్రి మూత్రవిసర్జన కోసం బయటకు వెళ్లగా పాముకాటు వేసింది. వెంటనే ములుగు ఏరియా ఆస్పత్రికి తరలించి చికిత్స చేయించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం ఎంజీఎం తరలించగా చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. మృతదేహాన్ని ఏటూరునాగారం తరలించారు. మృతుడికి భార్య హీన, ఐదుగురు పిల్లలు ఉన్నారు.

కొత్త చట్టంతో ధరణి సమస్యలకు చెక్

- చిన్నవంగర గ్రామాన్ని దత్తత తీసుకున్నాం
- మూడు దశల్లో విచారణ, సమస్యల పరిష్కారం
- కొత్త భూ చట్టం ఏర్పాటు కమిటీ సభ్యుడు సునీల్, ఎమ్మెల్సీ కోదండరాం



భూ సమస్యలపై రైతుల నుంచి దరఖాస్తులు తీసుకుంటున్న కోదండరాం, భూమి సునీల్

సాక్షి, మహబూబాబాద్ : ‘గత ప్రభుత్వం రూపొందించిన ధరణి పోర్టల్‌లో లోపాలు ఉన్నాయి. సమస్యల పరిష్కారానికి మార్గం చూపలేదు. దీంతో అనేక పొరపాట్లు జరిగాయి. వీటిని సరిచేసేందుకు ఎవరికీ హక్కులేకపోవడంతో రైతులు ఇబ్బందులు పడ్డారు. వీటన్నింటిని సరిచేసి, రైతులకు ఇబ్బందులు లేకుండా చూసేందుకే రాష్ట్ర ప్రభుత్వం కొత్త ఆర్ఓఆర్ చట్టం రూపొందిస్తుంది’ అని టీజేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం, లీఫ్స్ సంస్థ అధ్యక్షుడు, కొత్త చట్టం రూపకల్పన కమిటీ సభ్యుడు భూమి సునీల్ అన్నారు. కొత్త చట్టం రూపకల్పనలో భాగంగా క్షేత్రస్థాయి పరిశీలన కోసం లీఫ్ సంస్థ దత్తత గ్రామం పెద్దవంగర మండలం చిన్నవంగరలో గురువారం భూ న్యాయ శిబిరం, భూమి హక్కుల పరిరక్షణ నిర్వహణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని 172 మంది రైతులు తమ సమస్యలను వివరించారు. సాదాబైనామాతో పేరు మార్పిడి, భూమి నమోదులో తేడాలు, సాగులో ఉన్నా రికార్డుల్లో లేకపోవడం, గతంలో భూమిని అమ్ముకున్నవారి పేరున పట్టాదారు పాస్ పుస్తకాలు రావడం, ఒక నంబర్ భూమి మరో నంబర్‌లో నమోదు కావడం లాంటి తదితర సమస్యలు వివరించారు. రైతుల నుంచి దరఖాస్తులు తీసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ కోదండరాం మాట్లాడుతూ రాష్ట్రంలోని భూ సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం కొత్త చట్టం తీసుకొస్తోందన్నారు. దీంతో న్యాయపరమైన సమస్యలు తొలుగుతాయన్నారు. భూమి సునీల్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో భూ సమస్యలు ఎక్కువ ఉన్న రంగారెడ్డి జిల్లా యాచారం, మహబూబాబాద్ జిల్లా చిన్నవంగర, బొమ్మకల్లు, సూర్యాపేట జిల్లా పెంపటి, ఫణిగిరి, జనగామ జిల్లా బొమ్మెర గ్రామాలను లీఫ్స్ సంస్థ దత్తత తీసుకుందన్నారు. ఇందులో భాగంగానే యాచారం గ్రామంలో సదస్సు నిర్వహించి రైతుల నుంచి దరఖాస్తులు తీసుకున్నామన్నారు. ఇప్పుడు చిన్నవంగర గ్రామంలో దరఖాస్తులు తీసుకుంటున్నామన్నారు. దరఖాస్తులు ఆన్‌లైన్ చేయడం, సమస్యలకు కారణాలు, పరిష్కార మార్గాలు, చట్టంలో ఉన్న అంశాలను సమన్వయం చేస్తామన్నారు. వీటితోపాటు పాత భూరికార్డులు పహాణీ, ఇతర పాస్ పుస్తకాలు పరిశీలించి రైతులకు న్యాయం చేస్తామన్నారు. దరఖాస్తుల స్వీకరణ కోసం ఇద్దరు వలంటీర్లను నియమించామని, వారు రైతుల వద్దకు వెళ్లి సమస్యలను దరఖాస్తుల్లో పొందుపరుస్తారని చెప్పారు. కార్యక్రమంలో లీఫ్స్ సంస్థ సలహాదారులు కరుణాకర్ దేశాయ్, మహేశ్‌రెడ్డి, కృష్ణారెడ్డి, పెద్దవంగర తహసీల్దార్ మహేందర్, ఏఓ స్వామినాయక్, ఆర్ఐ లస్కర్, స్థానికులు నగేశ్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



విషజ్వరంతో బాలిక మృతి

- మృతదేహం తరలింపునకు అంబులెన్స్ ఏర్పాటు చేసిన బీఆర్ఎస్ నాయకుడు జంపన్న



గీతిక (ఫైల్)

ఏటూరునాగారం: విషజ్వరంతో మండల కేంద్రంలోని ఆకులవారిఘణపురం ప్రాంతానికి చెందిన కంకణాల శ్రీకాంత్, మహేశ్వరి దంపతుల కుమార్తె గీతిక(6) మృతి చెందింది. వివరాలు ఇలా ఉన్నాయి.. గీతికకు వైరల్ ఫీవర్ రావడంతో ఈనెల 1వ తేదీన వరంగల్ ఎంజీఎంలో చేర్పించారు. 19 రోజులుగా చికిత్స పొందుతూ గురువారం మృతి చెందింది. కాగా, మృతదేహాన్ని కనీసం వాహనంలో ఏటూరునాగారం తీసుకువచ్చే ఆర్థిక స్థోమత కూడా ఆ దంపతులకు లేదు. దీంతో ఈ విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ జిల్లా నాయకుడు జంపన్న వరంగల్ ఎంజీఎం వెళ్లి వాహనం ఏర్పాటు చేసి వారిని స్వగ్రామానికి తరలించి మానవత్వం చాటుకున్నారు.

‘గౌడ’ విద్యార్థులకు ప్రతిభా పురస్కారం

హన్మకొండ: 2023–2024 విద్యా సంవత్సరంలో పదో తరగతిలో 10/10 జీపీఏ సాధించిన గౌడ కులానికి చెందిన విద్యార్థులకు ప్రోత్సాహించేందుకు ప్రతిభాపురస్కారాలు అందించనున్నట్లు సర్దార్ సర్వాయి పాపన్న, కొండిన్న పరపతి సంఘం అధ్యక్షుడు అంబాల సూర్యనారాయణ గౌడ్, కార్యక్రమ నిర్వహణ కన్వీనర్ తండు నాగయ్య తెలిపారు. ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన ప్రభుత్వ, ప్రభుత్వ గురుకులాల్లో పదో తరగతి చదివి 10 జీపీఏ సాధించిన నిరుపేద విద్యార్థులు ఈ ప్రతిభా పురస్కారానికి అర్హులని వారు గురువారం ఒక ప్రకటనలో స్పష్టం చేశారు. వీరు ఉన్నత విద్య అభ్యసించేందుకు నగదు బహుమతి అందించి ప్రోత్సహించనున్నట్లు తెలిపారు. ఈ బహుమతి అందుకోవడానికి 10వ తరగతి మార్కుల మెమో, ఆధార్ కార్డ్, కుల ధ్రువీకరణ పత్రం హనుమకొండ, నయీంనగర్‌లోని మోషన్ జూనియర్ కళాశాలలో అందించాలని సూచించారు. ఈ నెల 29న హనుమకొండ, హంటర్ రోడ్‌లోని గౌడ హాస్టల్ జరిగే కార్యక్రమంలో నగదు బహుమతులు అందించనున్నట్లు కన్వీనర్ తండు నాగయ్య తెలియజేశారు. వివరాలకు 9701275354 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

చూసుకుని ఉమ్మి వేయొచ్చు కదా..

- ప్రశ్నించిన రైతుపై దాడి
- ఇద్దరు పాత నేరస్తుల అరెస్ట్
- వివరాలు వెల్లడించిన ఏసీపీ



వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ నందిరాం నాయక్

ఖిలా వరంగల్ : చూసుకుని ఉమ్మి వేయొచ్చు కదా.. అని ప్రశ్నించిన ఓ రైతుపై దాడికి పాల్పడిన కేసులో ఇద్దరు పాత నేరస్తులను పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ మేరకు గురువారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వరంగల్ ఏసీపీ నందిరాం నాయక్ వివరాలు వెల్లడించారు. వరంగల్ ఉర్సుగుట్ట బీఆర్ నగర్‌కు చెందిన నమ్మని కోట్ల మల్లికార్జున్ అలియాస్ మల్లేశం, జయశంకర్ భూపాలపల్లి జిల్లా రేగొండ మండలం కాశిబుగ్గకు చెందిన గడ్డం సంపత్ అలియాస్ సమోసా సంపత్‌లు పాత నేరస్తులు. పలు నేరాలలో జైలు శిక్ష అనుభవించారు. మల్లికార్జున్ హైదరాబాద్‌లో ఆటో నడుపుకుంటూ జీవనం సాగిస్తుండగా.. గడ్డం సంపత్ వరంగల్‌లో కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఈ క్రమంలో ఇటీవల బీఆర్‌నగర్‌కు చెందిన తమ స్నేహితుడు ప్రసాద్ అనారోగ్యంతో మృతి చెందగా 12న పరామర్శకు వచ్చారు. అనంతరం కాలనీ జంక్షన్‌లో ఆటోను పార్క్ చేశారు. ఈ సమయంలో వరంగల్ ఎస్ఆర్ఆర్‌తోటకు చెందిన రైతు ఆకుతోట సంతోశ్ తన బైక్‌పై వస్తున్నాడు. ఈ క్రమంలో మల్లికార్జున్ ఉమ్మి వేయగా సంతోశ్‌పై పడింది. దీంతో సంతోశ్ బైక్ ఆపి ‘నా మీద ఎందుకు ఉమ్మి వేశావు.. చూసుకుని ఉమ్మి వేయొచ్చు కదా’ అని ప్రశ్నించడంతో అరే నువ్వు మమ్మల్ని అడుగుతావారా.. అంటూ అందరూ చూస్తుండగానే కర్రలతో దాడికి పాల్పడ్డారు. సంతోశ్ భయంతో వారి నుంచి తప్పించుకుని పారిపోయాడు. ఈ ఘటనపై బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మల్లికార్జున్, సంపత్‌ను అరెస్ట్ చేసినట్లు ఏసీపీ నందిరాంనాయక్ తెలిపారు. సమావేశంలో ఇన్‌స్పెక్టర్ మల్లయ్య, ఎస్సై సురేశ్, సిబ్బంది పాల్గొన్నారు.

భార్య కాపురానికి రావడం లేదని..

- మనస్తాపంతో యువకుడి ఆత్మహత్య
- దామెరలో ఘటన

ఎల్కతుర్తి: భార్య కాపురానికి రావడం లేదనే మనస్తాపంతో ఓ యువకుడు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండలం దామెరలో చోటు చేసుకుంది. ఎస్సై గోదారి రాజ్‌కుమార్ కథనం ప్రకారం గ్రామానికి చెందిన ఆలకుంట రమేశ్ (30)కు వేలేరు మండలం పీచర గ్రామానికి చెందిన లతతో 2017లో వివాహం జరిగింది. వీరికి ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. ఈ క్రమంలో నాలుగు నెలల క్రితం దంపతుల మధ్య గొడవ జరగగా లత పుట్టింటికి వెళ్లిపోయింది. అప్పటి నుంచి రమేశ్ మనోవేదనకు గురవుతూ తన పిల్లలను చూడాలని ఉందని తన తండ్రి అయిలయ్యకు చెప్పుకుని బాధపడేవాడు. రోజు మాదిరిగానే గురువారం పొలం వద్దకు వెళ్లాడు. కుటుంబ సభ్యులు భోజనం తీసుకుని పొలం వద్దకు వెళ్లి చూడగా అక్కడ చెట్టుకు ఉరేసుకుని మృతి చెంది కనిపించాడు. వెంటనే పోలీసులకు సమాచారం అందించగా ఎస్సై రాజ్‌కుమార్ ఘటనాస్థలికి చేరుకుని మృతదేహాన్ని కిందికి దింపాడు. తండ్రి అయిలయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాజ్‌కుమార్ తెలిపారు.

డ్రైవర్ ఆత్మహత్య కేసులో ముగ్గురి అరెస్ట్

- వివరాలు వెల్లడించిన రైల్వే పోలీసులు

కాశిబుగ్గ: కుటుంబ సభ్యుల వేధింపులతో రైలు కింద పడి లారీ డ్రైవర్ కలకొండ మహేందర్ ఆత్మహత్యకు పాల్పడిన ఘటనలో రైల్వే పోలీసులు ముగ్గురిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. జీఆర్పీఎస్సై మొయినొద్దీన్ కథనం ప్రకారం.. సంగెం మండలం కుంటపల్లికి చెందిన కలకొండ మహేందర్ (28) చిన్నప్పుడే తల్లితండ్రులు చనిపోవడంతో పెద్దమ్మ, పెద్దనాన్న జయమ్మ, వెంకటనారాయణ వద్ద ఉంటున్నాడు. మహేందర్ కులవృత్తి వడ్రంగితో పాటు లారీ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. ఈక్రమంలో డబ్బుల విషయంలో పెద్దమ్మ, పెద్దనాన్నతో పాటు వారి కూతురు రాంపెల్లి వీణ గొడవపడి మహేందర్‌ను వేధింపులకు గురిచేశారు. దీంతో తీవ్ర మనస్తాపానికి గురైన మహేందర్.. మే 14న చింతలపల్లి, ఎల్గూరు రైల్వే స్టేషన్ల మధ్య రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టి ముగ్గురిని అరెస్ట్ చేసినట్లు జీఆర్పీ సీఐ మొయినొద్దీన్ గురువారం తెలిపారు.

ట్రాన్స్‌ఫర్ స్టేషన్ అందుబాటులోకి తీసుకురండి

- మేయర్ గుండు సుధారాణి

వరంగల్: పోతన ట్రాన్స్‌ఫర్ స్టేషన్‌ను తక్షణమే అందుబాటులోకి తీసుకురావాలని మేయర్ గుండు సుధారాణి అధికారులను ఆదేశించారు. గురువారం బల్దియా ప్రధాన కార్యాలయంలో సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్, వాహనాల ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్ అధికారులు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లతో జరిగిన సమావేశంలో వాహనాల నిర్వహణ, శానిటేషన్ అధికారులతో సమీక్షించారు. ఈసందర్భంగా మేయర్ మాట్లాడుతూ.. శానిటేషన్ నిర్వహణ సంబంధిత వాహనాలు మరమ్మతుల కోసం వస్తే వెంటనే రిపేర్లు పూర్తి చేయించాలన్నారు. సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్, శానిటేషన్ ప్రక్రియలో జాప్యం లేకుండా చూడాలని, అధికారులు సమన్వయంతో సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ నిర్వహణ ప్రక్రియలో ఆటంకాల్లేకుండా చూడాలని సూచించారు. అన్ని డివిజన్లలో శానిటేషన్ మెరుగుపడడానికి సిబ్బంది అధికారులు సమష్టిగా పని చేయాలన్నారు. బల్దియా వ్యాప్తంగా వీధి దీపాల నిర్వహణ క్రమబద్ధంగా జరిగేలా పటిష్ట చర్యలు తీసుకోవాలని సూచించారు. నయీంనగర్ బ్రిడ్జి సుందరీకరణలో భాగంగా వర్టికల్ గార్డెన్స్ తగినంత లైటింగ్ ఏర్పాటు చేయాలన్నారు. సమావేశంలో సీఎంహెచ్ఓ రాజేశ్, ఇన్‌చార్జ్ ఎస్ఈ రాజయ్య, హెచ్ఓ రమేశ్, ఈఈ మహేందర్, శానిటరీ సూపర్‌వైజర్ భాస్కర్, ఏఈలు పాల్గొన్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

SERVICES

BUSINESS OFFER

■ మీ దుకాణంకి మేము కిరాయి ఇస్తాము. బ్రాండ్ ప్రామోషన్ బిజినెస్ మీ దుకాణం, ఆఫీస్ మరియు ఇంటి గోడలకి డిజిటల్ డిస్‌ప్లేపెట్టి నెలకి 7000 నుంచి 18000 రూపాయల వరకు ఆదాయం ఇస్తాము. Legal Paper Work. ఫోన్: 9948000371, 9948000373 [HA-04510]

WANTED

■ మా ఆఫీస్‌లో పనిచేయుటకు టెలికాలర్స్, మేనేజ్‌మెంట్, రిసెప్షనిస్ట్, మార్కెటింగ్, సూపర్‌వైజర్ (స్త్రీ/పు) అర్జెంట్‌గా కావలెను. సంప్ర: 7382106287 [W-1239995]

■ అపార్ట్‌మెంట్స్, షాపింగ్‌మాల్స్, ఆఫీస్‌లలో పనిచేయుటకు సెక్యూరిటీ గార్డ్స్, సూపర్‌వైజర్స్, వాచ్‌మెన్స్, ఆయాలు, స్త్రీలు, పురుషులు & ఫ్యామిలి అర్జెంట్‌గా కావలెను. సంప్ర: 9491710857 [W-1239996]

■ LAB TECHNICIANS - BOYS ✦ PHARMACY BOYS (మందుల షాపు) ✦OT BOYS కావలెను. సంప్ర॥ Guardian Hospital, Mulugu "X" Road, Warangal 12 to 2 pm. [WA-0429]

■ మీ ఇంటివద్దనే ఉంటూ ఓల్డ్ రికార్డు చూసి న్యూ రికార్డ్స్ రాయటం స్త్రీ పురుష అభ్యర్థులు 12 మంది కావలెను. నెలకు జీతం 12,000/-. ఫోన్ : 70756 56208 [V- 6560]

4 లైన్ల క్లాసిఫైడ్ ప్రకటన రూ॥ 260/- అదనపు లైను రూ॥ 60/- మాత్రమే 5% GST అదనము

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకై సంప్రదించండి

హన్మకొండ	9010144453
వరంగల్	9705748198
నర్సంపేట	9553955722
జనగామ	9951602871
మహబూబాబాద్	9010144453
పరకాల	9010299096
జయశంకర్ భూపాలపల్లి	9705748198

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.